# అభివృద్ధి పనులను సమర్ధవంతంగా చేపట్టాలి

**మందమర్రి,నవంబర్ 10 (విజన్ ఆంధ్ర) :**

జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను సమర్ధవంతంగా చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. మంగళవారం జిల్లాలోని మందమర్రి మండలం సారంగపల్లి,ఆదిలపేట, పొన్నారం గ్రామపంచాయతీల పరిధిలో వివిజి రామ్ జి పథకం క్రింద కొనసాగుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సారంగపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన మురుగు కాలువలు,ఇంకుడు గుంతలు,కమ్యూనిటీ సోక్ పిట్, సి.సి వర్క్‌సైట్ పనులు,ఆదిల్ పేట గ్రామపంచాయతీలోని పి.టి వర్క్‌సైట్‌ను పరిశీలించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలైన ఆసరా పెన్షన్లు,ఇందిరమ్మ ఇళ్లు,రేషన్ కార్డులు,విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలలో అందిస్తున్న అల్పాహారం,మధ్యాహ్న భోజన పథకాల నిర్వహణ తనిఖీ చేశారు. అర్హులైన ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలలో చేర్పించి నాణ్యమైన విద్యను అందించాలని అవగాహన కల్పించారు. 3 గ్రామపంచాయతీల పరిధిలో పథకంలో భాగంగా చేపడుతున్న ఇంకుడు గుంతల నిర్మాణం, రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ రీఛార్జ్ స్ట్రక్చర్లు,బోర్‌వెల్ రీఛార్జ్ స్ట్రక్చర్ల నిర్మాణ పనులను పరిశీలించారు. గ్రామాలలోని వి.ఓ భవనాలు,అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి వాటి పనితీరును పరిశీలించారు. గ్రామాలలో త్రాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, నీటి సమస్యల నివారణకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సర్పంచులు,పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. రానున్న రోజులలో ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు,కరువు



ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపునకు అవసరమైన పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టాలని సూచించారు. గ్రామాలలో నీటి వనరుల పరిరక్షణకు ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారులు,మండల పంచాయతీ అధికారులు, పంచాయితీ రాజ్,గ్రామీణ నీటి సరఫరా శాఖల ఎ.ఈ.లు, ఉపాధి హామీ ఎ పి ఓ,ఈ.సి, టి.ఎ పంచాయతీ కార్యదర్శులు, ఆయా గ్రామాల సర్పంచ్ లు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దేవనూర్ లో నకిలీ, నాసిరకం, విత్తనాలతో మోసపోయి, మునిగిపోయి, నష్టపోయిన వరి రైతు,

## రైతుకు న్యాయం చేయాలి

## కెవిపిఎస్,వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్,

**యాలాల నవంబర్10, (విజన్ ఆంధ్ర)**

వికారాబాద్ జిల్లా యాలాల మండలం దేవనూరు గ్రామానికి చెందిన వరి రైతు, ఓ పెస్టిసైడ్, ఫర్టిలైజర్, షాపులో నాసిరకం విత్తనాలు కొని మోసపోయి నిండా మునిగిపోయాడు. మంత్రి ఎల్లప్ప అనే రైతు సర్వే నంబర్లు 66, 67లలో ఉన్న 6.00 ఎకరాల పొలంలో తాండూర్ లోని శ్రీ లక్ష్మి నరసింహ పెస్టిసైడ్ ఉ ఫెర్టిలైజర్ షాప్‌లో కొనుగోలు చేసిన వరి విత్తనాలను (నాసిరకం విత్తనాలు) నాటడం జరిగింది.

సదరు విత్తనాలు నాసిరకంగా ఉండటంతో పంట దిగుబడి రాక,రైతు పూర్తిగా నష్టపోయాడు.

ఈ విషయమై సమాచారం అందుకున్న కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం, నాయకులు దేవనూరు గ్రామంలోని సదరు రైతు పొలాన్ని మంగళవారం భౌతిక పరిశీలన చేశారు. ఈ సందర్భంగా పంట నష్టపోయిన తీరును చూసి నాయకులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా కేవీపీస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి. మల్కయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు యు. బుగ్గప్ప లు మాట్లాడుతూ.. ఆరుగాలం కష్టపడి పంట పండించిన రైతుకు నాసిరకం విత్తనాలు అమ్మడం వల్ల తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లింది. రైతు కుటుంబం రోడ్డున పడే పరిస్థితి ఏర్పడింది అని అన్నారు. ఇప్పటికే గతం ఈ మండలం లో నకిలీ ఎరువుల వ్యవహారం చూశామని, మళ్ళీ ఈ సంఘటన చూసుతున్నామని




అన్నారు. ఓ రాష్ట్ర సిఎం ప్రాతినిత్యం వహిస్తున్న జిల్లాలోనే ఇలాంటి సంఘటన చోటు చేసుకోవడం విడ్డురం ఉండదాన్నారు. వ్యవసాయ అధికారులు తక్షణమే స్పందించి విచారణ చేపట్టాలని పంట నష్టం పోయిన రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, తక్షణమే నకిలీ విత్తనాలను అమ్మిన వారి షాఫ్ పై మరియు కేసు నమోదు చేయాలని అని డిమాండ్ చేశారు.

నకిలీ, నాసిరకం విత్తనాలు అమ్మిన శ్రీ లక్ష్మి నరసింహ పెస్టిసైడ్ ఉ ఫెర్టిలైజర్ షాప్ యజమానిపై తక్షణమే క్రిమినల్ కేసు నమోదు చేయాలి.

నష్టపోయిన రైతు రికార్డులను పరిశీలించి, ఎకరానికి తగిన పరిహారం అందించి రైతు కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి.

మండల వ్యాప్తంగా నాసిరకం ఎరువులు, విత్తనాలు విక్రయిస్తున్న దుకాణాలపై వ్యవసాయ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలి.

ఈ పరిశీలన కార్యక్రమంలో కెవిపిఎస్,వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రైతు మంత్రి ఎల్లప్ప ఉన్నారు.